# అదోరకం మనిషి

"ఓ సారి వచ్చి వెళ్ళు, నాన్నా! నీకూ ఊపిరి పీల్చుకున్నట్లుంటుంది, పిల్లలూ సర్దా పడుతున్నారు" అని ఫోనులో సుబ్రహ్మణ్యం శతపోరాక, ఇంక తప్పదనుకుంటూ గుండె రాయి చేసుకుని, తన యు.కె ప్రయాణానికి చేయాల్సిన ప్రయత్నాలు చేశాడు వెంకట్రామయ్య. అప్పటికి అతనికి పాస్‌పోర్టు కూడా లేదు. పాస్‌పోర్ట్, వీసాలు వచ్చాయి. వెంకట్రామయ్యది జన్మలో విమానం ఎక్కిన మొహం కాదు.

తండ్రి ఇబ్బంది పడిపోతాడేమోనని, "నేను వచ్చి నిన్ను తీసుక వెళ్తాలే, నాన్నా!" అని ఫోను చేశాడు సుబ్రహ్మణ్యం .

"ఎందుకు, నేను రాలేనా ఆమాత్రం! నువ్వు రానూ, పోనూ అనవసరపు ఖర్చు, శ్రమ ఎందుకు?" అని జవాబు చెప్పాడు వెంకట్రామయ్య.

అతని లండను ప్రయాణం దుబాయ్ మీదుగా. శంషాబాదు విమానాశ్రయం నుండి దుబాయ్‌కి మూడు గంటల ప్రయాణం. అక్కడో మూడు గంటలు నిరీక్షించాక, తిరిగి ప్రయాణం ఏడు గంటలు. అప్పుడు హీత్రూ ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటుంది విమానం. విదేశం వెళ్ళటం ఎంత కష్టమోననుకున్నాడు వెంకట్రామయ్య. ప్రవాహంలో పడితే ఈదు కెళ్ళటం అంత కష్టం కాదని అతని కాతరువాత అర్థమైంది. విమానంలో కుడివైపు మూడు సీట్లలో– విండో సీటు, ఆ తర్వాతి సీట్లలో ఓ యువతీ, ఆమె భర్తా కూర్చున్నారు. మూడో ఐల్ సీటు వెంకట్రామయ్యది. కూర్చున్నాక బెల్ట్ పెట్టుకోవాలని అతనికి తెల్సు కానీ, ఎలా పెట్టుకోవాలో తెలియలేదు. తన పక్కన కూర్చున్న యువకుడి నడిగితే, అతను చెప్పాడు. ఆ తర్వాత మాటలు కలిశాయి.

"అయ్యో, అంకుల్! ఇంతకు ముందు ఒక్కసారి కూడా విమానం ఎక్కని వాళ్ళు, ఒక్కసారే ఇంత పెద్ద ప్రయాణం పెట్టుకున్నారే!" అని బోల్డంత ఆశ్చర్య పడిపోయింది ఆపిల్ల.

"పెద్ద ప్రయాణ మేముందిలే, తల్లీ! ఇక్కడ శంషాబాదు ఎయిర్ పోర్ట్ దాకా వచ్చి నా పెద్ద కొడుకు పంపించాడు. అక్కడ లండనులో నా చిన్న కొడుకు రిసీవ్ చేసుకుంటాడు.

నడిమి భాగోతమే మనది. అందుకు మీబోటి వాళ్ళ సాయమెలాగో ఉంటుంది" అని జవాబిచ్చాడతను.

మొదట ఎయిర్ పోర్ట్‌లో అడుగు పెట్టినప్పుడున్న భయం ఇప్పుడు అతనిలో ఏ కోశానా లేదు. కొత్త వింతలేవో చూస్తున్న ఉత్సుకతలో అతనున్నాడు. ముందు సీటు వెనక, తనకు ఎదురుగా అమర్చిన టివి స్క్రీను పై వేలితో కదిపితే కొత్త కొత్త సినిమాలు మారి పోతున్నాయి. మూడు గంటలు క్షణంలో గతించి పోయాయి. దుబాయ్ ఎయిర్ పోర్ట్ రిపేరులో ఉంది. ఎయిర్ పోర్ట్‌లో బయట ఎక్కడో విమానం ఆగింది. రెండు పెద్ద బస్సుల్లో ప్రయాణీకుల్ని తరలిస్తున్నారు. విమానం దిగగానే ఆ ఆగష్టు మాసంలోనూ ముప్పై ఏడు డిగ్రీల వేడి గాలి వీచింది. ఓ పావు గంట ప్రయాణించి బస్సు ఎయిర్ పోర్ట్ బిల్డింగ్ దగ్గర ఆగింది. బస్సు దిగి లోపలికి వెళ్ళేటప్పటికి చల్లటి గాలులు వీచాయి. లోపలకు వెళ్ళబోయేముందు షూజ్ సాక్స్ కూడా విప్పించి చెక్ చేశారు. నిజానికి ఎవర్నీ అడగాల్సిన పని లేదు. అన్నీ రాసి పెట్టి ఉన్నాయి. వెంకట్రామయ్య ఏ గేటు దగ్గర నిరీక్షించాలో చూపించి ఆ యువజంట వెళ్ళిపోయింది.

వెళ్ళబోయే ముందు ఆ పిల్ల అడిగింది, "మీ పేరేమిటి, అంకుల్ !" అని.

"అంకులేనమ్మా!" అని నవ్వేసి ముందుకు కదిలాడు వెంకట్రామయ్య.

'కమింగ్ ఈవెంట్స్ కాస్ట్ దైర్ షాడోస్ బిఫోర్' అన్నట్టు, వెంకట్రామయ్య తన పతనానికి తనే నాంది పలుక్కున్నాడు. ఆ పిల్ల అడిగినప్పుడు చెప్పెయ్యొచ్చుకదా – తన పేరు ఫలానా అని. నేను వాడికెప్పుడూ చెప్తుండేవాడిని – చిన్న విషయాల్లో జాగ్రత్త తీసుకుంటే పెద్దవి వాటంతటవే సర్దు కుంటాయని. ఉహూ నా మాట విన్పించుకోలేదు.

దుబాయ్‌లో మూడు గంటల నిరీక్షణ తర్వాత, లండను ఫ్లైటులోకి అనుమతించారు. శంషాబాదు ఎయిర్ పోర్ట్‌లోనే లండను విమానంలోనూ ఐల్ సీటు కేటాయించారు వెంకట్రామయ్యకు. ఇది పెద్ద విమానం. మూడొందలకు పైగా ప్రయాణీకులను మోసుకెళ్తుంది. అటూ ఇటూ మూడు సీట్ల వరుసలూ, మధ్యలో నాలుగు సీట్ల వరుసలు. ఈసారి మధ్య వరుస ఐల్ సీటు అతనిది.

విమానం టేకాఫ్ అయ్యాక, వెంకట్రామయ్య పక్క నున్న మూడు సీట్ల వరుసలో విండోసీటు వ్యక్తి, "ఓ, ఇట్స్ యు, సుబ్బూస్ ఫాదర్" అని అరిచాడు.

వెంకట్రామయ్య అతని వైపు తిరిగి, 'ఎవరా?' అని పోల్చుకో ప్రయత్నించాడు.

"గుర్తించలేదా, అంకుల్?" అనడిగాడు ఆ కుర్రాడు.

"నువ్వు.....నువ్వు మా ఇంట్లో జామ చెట్టెక్కి కొమ్మ విరిగి కింద పడ్డ ఆంజనేయులువి కదూ?"

"ఇప్పుడా పాత హిస్టరీ అంతా అవసరమా, అంకుల్? మీకెన్ని సార్లు చెప్పినా గుర్తుండదు – నా పేరు ఆంజనేయులు కాదు హనుమంతు అని. మళ్ళా ఇప్పుడు జోక్ చెయ్యకండి 'ఏ కోతయితే ఏం లేవయ్యా' అని" అంటూ, ఆ వరుసలో ఐల్ సీటులో వున్న వ్యక్తికి తన సీటు ఆఫర్ చేసి, తను నా పక్కకి చేరాడు.

తన కొడుకులతో కంబైన్డ్ స్టడీస్ చేసేవాడు హనుమంతు. పక్కింటివారి పిల్లని చూడటానికి జామ చెట్టు ఎక్కాడు, కొమ్మ విరిగి కింద పడ్డాక జామ పండ్ల కోసం చెట్టెక్కానని చెప్పాడు హనుమంతు.

"ఛ,ఛ.... అప్పుడేదో కుర్రాడివి, జోక్ చేశాను. నువ్వింకా అది మనసులో పెట్టుకున్నావా? ఫర్ గెటిట్ మై బాయ్! నువ్వు జాంచెట్టు మీద నుంచి పడటం నిజమే కదా? నీ గురించి నా మనసులో నిలచిన గుర్తింపు అదే !"

"దట్స్ ఎట్రాషియస్ సుబ్బూస్ ఫాదర్ !" అన్నాడు హనుమంతు.

"అదేం మాట! 'అంకుల్' అను. లేకపోతే శుభ్రంగా మన తెలుగులో 'మామయ్యా' అని పిలువు."

ఆ కుర్రవాడి కంట్లో ఓ మెరుపు మెరిసింది.

"మీ గురించి నా మనసులో నిలచిన గుర్తింపు అదే, సుబ్బూస్ ఫాదర్ !"

కొడుకు సుబ్రహ్మణ్యం క్లాసుమేటు హనుమంతు. చిన్నప్పటి నుండి తెలిసిన పిల్లవాడు. అలా జోకులు వేసుకోటం వాళ్ళకెప్పటి నుండో అలవాటు.

"ఓరేయ్, 'సుబ్బూస్ ఫాదర్' ఏవిట్రా? నాకో ఐడెంటిటీ ఉంది. నా పేరు వెంకట్రామయ్య. పోనీ అలా పిలువు" అన్నాడు వెంకట్రామయ్య

"తప్పు, అలా పేరు పెట్టి పిల్చి అమర్యాద చెయ్యలేను, సుబ్బూస్ ఫాదర్ !"

"సర్లే, లెట్స్ కాంప్రమైజ్. నువ్వు 'అంకుల్' అని పిలువు, నేను జాంచెట్టు ప్రస్తావన తీసుకు రాను."

"ఇట్స్ ఓకే, సుబ్బూస్ ఫాదర్– సారీ అంకుల్ !" అని నవ్వాడు హనుమంతు.

"ఇంతకీ ఇప్పుడెటూ బయలు దేరావు?" అడిగాడు వెంకట్రామయ్య.

"లండనుకే. మొన్న దుబాయ్‌కి వచ్చాను. బిజినెస్ పని."

"గుడ్! సుబ్బు ఎయిర్ పోర్ట్‌కు వస్తాడు. అందరం కల్సే వెళ్ళచ్చు."

"ఇవ్వాళ సుబ్బును కలిసే అవకాశం లేదు. వెంటనే పారిస్ వెళ్ళాలి. తిరిగి వచ్చేటప్పుడు కలుస్తాను."

అలా కబుర్లు చెప్పుకుంటూంటే ఏడు గంటల కాలం ఇట్టే గడచి పోయింది. హీత్రూ ఎయిర్ పోర్ట్‌లో ప్లేన్ లాండవగానే హనుమంతు పారిస్ ఫ్లయిట్ ఎక్కటానికి వెళ్ళిపోయాడు.

హీత్రూ ఎయిర్ పోర్ట్‌లో ఇమ్మిగ్రేషన్ ఆఫీసరు పేరడిగినప్పుడు, హనుమంతు వేసిన జోక్ గుర్తుకు చేసుకుంటూ, 'సుబ్బూస్ ఫాదర్' అనబోయి, నాలిక్కరచుకుని, తను వెంకట్రామయ్య అని గుర్తుకు తెచ్చుకున్నాడు.

"హౌ లాంగ్ డు యు ప్రొపోజ్ టు స్టే హియర్?" అని ఇమ్మిగ్రేషన్ ఆఫీసరు అడిగాడు.

"మూడు నెలలు" జవాబిచ్చాడు వెంకట్రామయ్య.

"ఎవరి దగ్గర ఉంటారు?"

"మా అబ్బాయి ఇక్కడ పని చేస్తున్నాడు. అతడి దగ్గర ఉంటాను."

"ఓ.కె. విష్ యు ఎ ప్లెజెంట్ స్టే ఇన్ యు.కె." అంటూ అతను పాస్‌పోర్ట్‌లో వీసా కింద ముద్ర కొట్టి పంపించేశాడు.

ఆ తర్వాత తన కొడుకు తనకు అంతకు ముందు ఇచ్చిన సమాచారం ప్రకారం తన బాగేజీ సేకరించి బయట కడుగు పెట్టగానే కొడుకు, కోడలు, మనవళ్ళు అతన్ని ఆహ్వానించారు.

అదుగో అప్పటి నుండి మొదలయింది గోల. ఇల్లలుకుతూ తన పేరు మర్చిపోయిన ఈగ కథ మీకు గుర్తుండే వుంటుంది. అది మన సుబ్బూస్ ఫాదర్ లాంటిది కాదు. దానికి తన పేరు మర్చిపోయిన స్పృహ ఉంది. అందుకే "పేదరాసి పెద్దమ్మా! పెద్దమ్మ కొడకా! కొడుకు చేతి గొడ్డలీ !....నా పేరేమిటి?" అని ఎందరినో పేరు పేరునా వరస పెట్టి అడిగిందట! చివరకు తన పేరేమిటో తెలుసుకుంది. మా వాడు మాత్రం ఆ పని చెయ్య లేదు.

పుట్టుక-చావు అనే రెండు సంఘటనల మధ్య కాలమే జీవితం అన్నారు. మా వాడు రెండు ఘటనల మధ్య కాలం మాత్రం తన బతుకు తాను బతక లేకపోయాడు. మీరడగవచ్చు- ఏవిటా సంఘటనలని. ఇంగ్లాండు వెళ్ళటం, తిరిగి రావటం - ఆ

సంఘటనలు. వెళ్ళేంతవరకు వెంకట్రామయ్యకు తన పేరు గుర్తుంది. తిరిగి వచ్చాక తన పేరు గుర్తుకు రాక తప్ప లేదు. ఈ రెండు సంఘటనల మధ్య బతుకు సంగతే నేను మాట్లాడేది.

సుబ్రహ్మణ్యం లండనుకు పాతిక మైళ్ళ దూరంలో ఉన్న రెడింగ్‌లో ఉంటున్నాడు. అదీ చిన్నపాటి పట్నమే. శనీ, ఆదివారాలు అందరికీ శలవు కావటాన అందరూ కల్సి చూడదగ్గ ప్రదేశాలు చూసేవాళ్ళు. చూడాల్సినవి ఎక్కువగా లండనులో ఉండటంవల్ల అక్కడకు ఎక్కువసార్లు వెళ్ళటం జరిగింది. లండనుకు ఎప్పుడు వెళ్ళినా కారును సొతాల్లో పార్క్ చేసి, అక్కడ నుండి లోకల్ ట్రయినులో లండను పాడింగ్‌టన్‌కు వెళ్లేవాళ్ళు.

వెళ్ళిన రోజే, "తాతా! రేపు మనం 'బకల్‌బెర్రీ ఫామ్' కు వెళ్దాం. భలే తమాషాగా ఉంటుంది" అన్నాడు పెద్దమనవడు.

కొడకు, కోడలు ముందు కూర్చుంటే, వెనుక సీటులో మనవళ్ళమధ్య కూర్చున్నాడు వెంకట్రామయ్య.

"ఏంవుంటుంది రా అక్కడ?" అని అడిగాడు.

"బోల్డన్ని ఏనిమల్స్ ఉంటాయి. జారుడు బండలు ఉంటాయి. ఇంతెత్తు నుండి జారాలి తెల్సా! నాకు భయం వెయ్యదు..."

"ఓ సారి పొరపాటున తీసుకెళ్ళాం అక్కడికి. చిన్న జూ లాంటిది. ఇంక ప్రపంచంలో అంతకంటే అద్భుతమైన ప్రదేశం మరొకటి లేదనుకుంటాడు వాడు. అక్కడ నుండి తిరిగి రావటం ఇష్టముండదు వాడికి" అన్నాడు సుబ్బు. ఇంటికొచ్చి భోజనాలయేటప్పటికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. తనకు నిర్దేశించిన గదిలో వెంకట్రామయ్య నిద్రకుపక్రమించాడు. గంటలు గడిచాయిగానీ అతనికి నిద్ర పట్టలేదు. ఇంగ్లాండుకు ఇండియాకు మధ్య సమయ వ్యత్యాసం ఐదున్నర గంటలు. అంటే అతను నిద్రకుపక్రమించే సమయానికి ఇండియాలో టైము అర్ధరాత్రి రెండున్నరయింది. అర్ధరాత్రి దాటితే వెంకట్రామయ్యకు నిద్ర పట్టదు. మనిషంటే వేల మైళ్ళు ప్రయాణించి ఖండాంతరాలు చేరుకోవచ్చు. మానవ శరీరం ఓ ధర్మానికి అలవాటుపడి ఉంటుంది. బయొలాజికల్ టైము, క్లాక్ టైము అడ్జస్ట్ కావటానికి కొంత టైము పడ్తుంది. దాన్ని 'జెట్ లాగ్' అంటారని ఆ తర్వాత కొడుకు చెప్పాడు వెంకట్రామయ్యకు. ఇంగ్లాండు టైముకు అడ్జస్ట్ కావటానికి రెండు, మూడు రోజుల సమయం పట్టింది వాడికి.

ఓ ఆదివారం 'బకల్‌బెర్రీ ఫామ్' కు వెళ్ళారు. మరో శలవ రోజు ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్ళారు. ట్రినిటీ కాలేజీ చూశారు. మనదేశంలో ప్రఖ్యాత గణితశాస్త్రజ్ఞుడు రామానుజన్ అక్కడే చదువుకున్నాడు. మరో ప్రఖ్యాత గణితశాస్త్రజ్ఞుడు హార్డీ పిలిపిస్తే వచ్చాడు. 'బాత్' లో రోమన్ల కాలం నాటి స్నానశాలలు ఉన్నాయి. అక్కడో చిత్రకారుడు తగిలాడు వాళ్ళకు. ఐదు పౌన్లుతీసుకుని ఐదు నిమిషాన్లో మనిషి బొమ్మగీస్తాడు. పిల్లలిద్దరూ బొమ్మలు గీయించుకున్నారు. వెంకట్రామయ్యకు రెండు బొమ్మలూ ఒకటిగానే కన్పించాయి. వాడి తీరే అంత. దేన్నీ మెచ్చుకో బుద్ధికాదు వాడికి. 'ఐల్ ఆఫ్ వైట్' కు వెళ్ళిరావటం మంచి అనుభవం. సౌతాంప్టన్‌లో ఓడ ఎక్కి ఆ ద్వీపానికి వెళ్ళాలి. సీదా కారులో కూర్చునే షిప్ లోకి వెళ్ళిపోవచ్చు, అలాగే ద్వీపం రాగానే కారులో కూర్చునే బయటకు వెళ్ళిపోవచ్చు.

ఇంగ్లాండులో ఆరు, ఎనిమిది లేన్ల మోటర్ వేలు. ఎనభై, వంద మైళ్ళ వేగంతో వెళ్ళే వాహనాలు. ఆ మోటర్ వేల మీద నడిచే మనుషులూ, జంతువులూ కన్పించరు/వు. మన దేశంలో లాగానే ఎడం వైపు ప్రయాణమే. బ్రిటీషువాళ్ళేకదా – మన దేశంలోనూ ఎడం వైపు వెళ్ళాలన్న రూలు పెట్టింది. కనుక, ఎక్కడా కుడివైపు తిరిగే ప్రసక్తే ఉండదు, అక్కడక్కడా మోటర్ వేపై వంతెనలు ఉంటాయి. ఎడం వైపు లేన్‌లోకి మళ్ళి, బ్రిడ్జ్ మీదుగా కుడివైపుకు రావల్సిందే. మన దేశంలోలా ఎక్కడబడితే అక్కడ కుడివైపు తిరగటానికి వీలుండదు. కుడివైపు తిరగటానికి సరయిన మలుపులో తిరగక పోయినట్టయితే, మైళ్ళు ముందుకు పోయివెనక్కి తిరిగి రావల్సి ఉంటుంది. నిర్దేశించిన స్పీడ్ లిమిట్ లోనే వాహనం నడపాలి. రోడ్డు పక్కన కెమేరాలుంటాయి. మన కారువేగాన్ని అవి పసి గడ్తాయి. నిర్దేశించిన స్పీడ్ లిమిట్ దాటామా, మన కొంపకు చిట్టీ వచ్చిందన్న మాటే! ఓ సంఖ్య మించిన ట్రాఫిక్ వయొలేషన్స్ జరిగితే, ఆ వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుంది. ఓసారి లైసెన్స్ రద్దయితే మళ్ళా అది సంపాదించటం కష్టం. అక్కడ డ్రైవింగ్ లైసెన్స్ లేని బతుకును ఊహించటం కూడా కష్టమే.

మన ఆంధ్రదేశంలో లభ్యమయే కూరలన్నీ అక్కడ దొరుకుతాయి – ఒక్క దోసకాయ తప్ప. కాస్తంత కష్టపడి వెతికితే అదీ లభ్యమవుతుంది. మన కూరలూ, పళ్ళూ, వస్తువులూ సౌతాల్‌లో లభ్యమవుతాయి. అది నిజానికి పంజాబే. ఎప్పుడో పంజాబు నుండి వచ్చిన జనం సౌతాల్‌లో సెటిలయ్యారు.

ఆరోజు సుబ్రహ్మణ్యం తండ్రిని లండను తీసుకెళ్ళాడు. వర్కింగ్ డే కావటం వల్ల కోడలూ, పిల్లలూ రాలేదు. ముందుగా బకింగ్‌హామ్ పాలెస్‌కి వెళ్ళారు. బ్రిటీషు రాణి నివాస స్థానమది. ఏదో ఫంక్షను జరుగుతుండటం వల్ల దగ్గరకు కూడా ఎవరినీ

అనుమతించటం లేదు. అక్కడనుండి పార్లమెంట్ హవుసుకు వెళ్ళారు, 'బిగ్‌బెన్' గడియారం, 'టింటరెన్ అబ్బే' చూసి ట్రఫాల్గర్ స్క్వేర్‌కు వచ్చారు. అక్కడ కలిశారు రామ్మోహన్, అతని భార్య, తల్లీదండ్రీ. సుబ్రహ్మణ్యం వాళ్ళను తండ్రికి పరిచయం చేశాడు. వాళ్ళది గుంటూరు జిల్లా చెరుకూరు. రామ్మోహన్ ఏదోకంపెనీలో పని చేస్తున్నాడు. అతని తండ్రి అనంతరాములికి తెలుగువాళ్ళని చూస్తే ప్రాణం లేచొచ్చినట్లయింది. ఆయన చదువుకున్నవాడే కానీ రైతుగా స్థిరపడి పోయాడు. ఓ మోస్తరు ఆసామే. కొడుకు ఇంగ్లాండుకు తన తల్లిదండ్రులను వెంటపెట్టుకు వచ్చాడు.

ట్రఫాల్గర్ స్క్వేర్ ఎదురుగానే 'నేషనల్ మ్యూజియం'. టిక్కెట్టు లేదు. అందరూ కల్సి లోపలకు వెళ్ళారు. ఎన్నోగదులు. శతాబ్దాల క్రమంలో చిత్రాలను గదుల్లో అమర్చారు. కొన్ని చిత్రాల నమూనాలు ఉన్నాయి. రాఫేల్, మైకేల్ ఏంజలో, లియొనార్డో డావిన్సీ లాంటి పాత చిత్రకారుల చిత్రాలనుండీ ఇంప్రెషనిష్టులు – మానే, మోనే, దిగాస్, మరెంతో మంది వేసిన బొమ్మలున్నాయి, ప్రదర్శింపబడుతూ. ఆ గదులు తిరిగి చూస్తున్న వెంకట్రామయ్యకు మామ్ 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' లో నాయకుడు ఫిలిప్ కారే, అతని మిత్రులు మాట్లాడుకున్న మాటలు గుర్తుకు వచ్చాయి. మానే గీసిన 'ఒలంపియా' చిత్రాన్ని విమర్శిస్తూ, ఓ అమెరికన్, 'ఆ నల్లగీత మాటేమిటి? ప్రకృతిలో వస్తువుల చుట్టు నల్లగీత ఉండటం మనకు కన్పించదు' అన్నాడు. లాసన్ చెప్పాడు, 'ప్రకృతిలో ఏం ఉందో, ఏం లేదో ఎవరికీ తెలీదు. కళాకారుడి కళ్ళల్లో కుండా ప్రపంచం ప్రకృతిని చూస్తుంది. ఎందుకూ? నాలుగు కాళ్ళు సాచి కంచెను దూకుతున్న గుర్రాన్ని శతాబ్దాల తరబడి చూసింది.....' నైతిక భావన లేకుండా ఏ చిత్రమూ మనలేదు అన్న అమెరికన్ మాటలనూ ఖండించాడు లాసన్. అప్పుడు కీట్స్ రాసిన 'ఓడ్ టు గ్రేషియన్ అర్న్' గుర్తుకు వచ్చింది వెంకట్రామయ్యకు. కళా శాశ్వతత్వాన్ని అందులో ప్రతిపాదించాడు కీట్స్. ఓ గ్రీకు పాత్ర మీద ప్రేమికుల బొమ్మల్ని చిత్రించాడు చిత్రకారుడు. అతను తన ప్రేమను వ్యక్త పరుస్తూనే ఉన్నాడు, ఆమె అతన్ని తిరస్కరిస్తూనే ఉంటుంది – హిందీ సినిమా కవి, 'ఖులే పలక్ మే ఝూటా గుస్సా, బంద్ పలక్ మే ప్యార్' అన్నట్టు. ఆ ప్రేయసీ ప్రియులు ఎప్పటికీ అలాగే ఉండిపోతారు. నిజానికి కీట్స్ చూసిన గ్రీకు పాత్ర ఇప్పుడుందో లేదో, ఆ ప్రేయసీ ప్రియులు మాత్రం ఇప్పటికీ నిల్చి పోయారు కీట్స్ కవితలో. అప్పుడు గుర్తుకు వచ్చింది వెంకట్రామయ్యకు బ్రిటీషు మ్యూజియంలో ఫిలిప్ జీవితానికి అర్థంలేదని తెలుసుకున్న దృశ్యం. "జీవించటం ద్వారా మనిషి ఏ ప్రయోజనం సాధించలేడు. అతను పుట్టటం, పుట్టకపోవటం అప్రధానం. జీవితం అప్రధానం, మరణం అప్రధానం.... సంతోషం అన్న ప్రమాణంతో కొల్చినప్పుడు తన జీవితం భయంకరంగా అన్పించింది. కాని ఇప్పుడు సంతోషంతో కాక మరొకదానితో

దాన్ని కొలవటం సాధ్యమన్న జ్ఞానం ఈతనికి బలాన్ని చేకూర్చి పెట్టింది. సుఖానికీ, దుఃఖానికీ భేదం పోయింది.”

“మనమొకసారి బ్రిటీషు మ్యూజియానికి వెళ్ళాలిరా” అన్నాడు వెంకట్రామయ్య కొడుకుతో.

“వెళ్దాం, ఎప్పుడో ఓ సారి.”

అక్కడ చాలమంది ఇండియన్లు ఉన్నారు. తెలుగువాళ్ళూ ఉన్నారు. అంతా కలసిమెలసి ఉంటారు. ఎప్పుడయినా కొడుకు మిత్రులతోనూ బయటికి కలసివెళ్ళటం జరుగుతుండేది. బయటకు వెళ్ళక పోతే మాత్రం ఏ ఒకరి ఇంట్లో నయినా కలుసుకోటం జరుగుతుండేది. ఇంట్లో దొడ్లో ఆరుబయట విందులు చేసుకుంటారు. దాన్ని ‘బార్‌బెక్యూ’ అంటారు. ఆరోజు సదానందం ఇంట్లో ‘బార్‌బెక్యూ’. అక్కడికి రామ్మోహన్ కుటుంబం కూడా వచ్చింది.

“ఏందండీ ఇంత జనం, ఆద? ఆళ్ళకేం ఆఫీసులుండవా?” అన్నాడు, రామ్మోహన్ తండ్రి, అనంతరాములు, ట్రఫాల్గర్ స్క్వేర్‌లో గుమికూడిన జనం ప్రస్తావన తీసుకు వస్తూ, వెంకట్రామయ్యతో.

“మన దేశంలో లాగ కాదు, మామా, ఈళ్ళు లైఫ్ ఎంజాయ్ చేస్తారు. మనకు బతకటం తెలీదు. పొద్దున లేచిన కాడనుంచీ పడుకునే దాకా ఒకటే పని” అంది అతని కోడలు. చెల్లెలి కూతురే కనుక ఆమెకు మామ దగ్గర చనువు.

“మనతో సావాసం చేశాక చెడిపోయారు. మనం పని చేస్తున్నాం, వాళ్ళు ఎంజాయ్ చేస్తున్నారు. అందుకనే అధోగతిలో పడి పోతున్నారు. చిన్నదేశమయినా ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పరిపాలించారు. ఇప్పుడేమయింది. అమెరికా కొంగు పట్టుకుని తిరుగుతున్నారు. మనమంత దూరంనుండి ఇక్కడకు సంపాదనకు వచ్చాం. వీళ్ళు చదువు కోటం మానేశారు. తప్పదు కనుక స్కూలు చదువు చదువుతారు. రెసిషన్ వచ్చింది. ఉద్యోగాలు పోతున్నయ్యి. అందుకు మనమే కారణమనుకుంటున్నారు” అన్నాడు వెంకట్రామయ్య.

“మాబాగా చెప్పారు” అన్నాడు అనంతరాములు. అతని కోడలు గుర్రుగా చూసింది వెంకట్రామయ్య వంక.

“అది నిజమే. ఈళ్ళు సోమరిపోతులంటే మాత్రం నేనొప్పుకోను. చక్కటి రోడ్లు, పొల్యూషన్ లేని వాతావరణం, నిరంతరం విద్యుచ్ఛక్తి, కనిపించని లంచగొండితత్త్వం, రూల్సు పాటించటం - ఇవన్నీ సోమరిపోతు తనానికి చిహ్నాలంటే నేనంగీకరించను” అన్నాడు సదానందం.

'రోడ్లు, పొల్యూషన్, రూల్సు మూడే ఇంగ్లీషు మాటలు. మీరింకా ఇంప్రూవ్ చెయ్యాలి" అన్నాడు ప్రభాకర్.

లండనులో ఓ దరిద్రపు తెలుగు ఛానల్ ఉంది. దాంట్లో ఓ కార్యక్రమం ఇంగ్లీషు పదాలుపయోగించకుండా తెలుగు మాట్టాడటం. అందులో సదానందం తరుచూ పాలుపంచుకుంటూ ఉంటాడు. అయినా కొన్ని ఇంగ్లీషు పదాలు తప్పవు.

"ఎందుకు ఇంగ్లీషు మాటల్ని ఉపయోగించకూడదు? మడి కట్టుకుని ఒంటరిగా బతగ్గలదా ఏ జాతయినా, భాషయినా? మనం సంస్కృతం లేకుండా తెలుగు మాట్లాడ గలమా? సంకరమేదయినా జరిగిందనుకుంటే నన్నయ కాలానికే అది జరిగి పోయింది. ఇప్పుడింక ఇంగ్లీషని పట్టింపెందుకు? తెలుగుభాషకున్న వికారం కానివ్వండి, ప్రత్యేకత కానివ్వండి– మనం అచ్చతెలుగులో మాట్లాడలేం. వేరే విదేశీ, అన్య భాషా పదం లేకుండా తమిళం మాట్లాడవచ్చు, తెలుగులో సాధ్యపడదు.ఎట్ బెస్ట్ ఉయ్ కెన్ సే దట్ అవర్ తెలుగు హేజ్ అక్వైర్డ్ కాస్మోపాలిటన్ కారెక్టర్ లాంగ్ ఎగో, అన్ లైక్ అదర్ లాంగ్వేజెస్. సో ద వెరీ కన్సెప్షన్ ఆఫ్ దట్ ప్రోగ్రామ్ ఈజ్ రాంగ్....." అన్నాడు వెంకట్రామయ్య.

చెప్పటానికి సమాధానం ఏం లేక ప్రభాకర్ మొఖం ముడుచుకున్నాడు.

మొక్కజొన్న కండెలు కాల్చి పట్టుకొచ్చింది అనంతరాములు కోడలు. తన మాటలు కాదన్నాడని ఇప్పటికే గుర్రుగా ఉంది కామేశ్వరి. "ఏం ఎందుకు మాట్లాడలేం, మనకు చేతకాకపోతే సరి!" అంది ఆమె.

"ఓ.కె. 'ప్రస్తుత ఇంగ్లాండు దేశం – ఇక్కడి భారతీయులు' ఇది మీకిచ్చిన అంశం. యువర్ టైమ్ స్టార్ట్స్ నౌ. మ్లేచ్ఛ ఆంగ్ల పదం లేకుండా తెలుగులో మాట్లాడమ్మా!" అన్నాడు వెంకట్రామయ్య, లండను తెలుగు ప్రోగ్రామ్ లోని ఆంకర్‌ని అనుకరిస్తూ.

"నువ్వు మాట్లాడు, బావా!" అంది ఆపిల్ల మొగుడి సాయం కోరుతూ, మొక్కజొన్న కండె అందిస్తూ.

రామ్మోహన్ నీళ్ళునమలటంచూసి అతని తండ్రి ఎత్తుకున్నాడు. "ఇంగ్లాండు దేశమును మన భారతీయులు పరాయి దేశముగా భావించలేరు. లండను మన బొంబాయి నగరము వలె నుండును. బొంబాయిని నిర్మించినది ఆంగ్లేయులే. ఆంగ్లభాషను కూడా మనవారి వలె కొద్దిమంది మాత్రమే మాట్లాడగలరు. ఇక్కడకు వచ్చిన మన ఆంధ్రులు కష్టించి పని చేసెదరు. అయితే ఇంగ్లండులోనే స్థిర పడి పోవాలనెడి వీరి ఆలోచన నాకు నచ్చదు. ఇంగ్లండు నందు కాలుష్యము ఉండదు. రోడ్లు బాగుండును. ఆంగ్లేయులు తమకు జాతి

వివక్ష లేదని చెప్పుకున్నప్పటికీ వీరు సహనము వహించగలరు. ఈ కారణములచే ఇక్కడే సెటిలయిన బాగుండుననుకొనుట తప్పు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న ఆర్యవాక్యమును మనం జ్ఞప్తియందుంచుకొన వలెను" అంటూ ఆ సాకుగా తన మనసులోని కష్టాన్ని బయట పెట్టుకున్నాడు, తలెత్తి విజయవంతంగా వెంకట్రామయ్య వంక చూశాడు అనంతరాములు.

వెంకట్రామయ్య నవ్వాడు. "మనమిద్దరం ఒక వయసువాళ్ళం. మీ తప్పులు నేను పట్టుకోకూడదు. అయినా ఒక మాట. మీ మాటల్లోనూ రెండు ఆంగ్ల పదాలు దొర్లాయి. ఇంగ్లీషు మాట రాకూడదని మీరెంత తాపత్రయ పడ్డారు! అందుకు మీభాషని కృతకం చేసుకున్నారు. 'ఇంగ్లాండుని మనోళ్ళు పరాయి దేశమని ఎట్లా అనుకుంటారబ్బా!లండనుమన బొంబాయి అసుంటిదే. దాన్ని కట్టింది ఇంగ్లీషోళ్ళే.....' అని హాయిగా మీ నేటివ్ టంగ్‌లో మాట్లాడేవాళ్ళు..."

అనంతరాములు హాయిగా నవ్వేశాడు కానీ, రామ్మోహన్ తన తండ్రి గ్రామ్య భాషని వెంకట్రామయ్య అవహేళన చేసినట్లు భావించాడు.

"మాది పల్లెటూరు కదండీ! మేమట్లాగే మాట్లాడతాం. మా భాష అంతే! సుబ్బూస్ ఫాదర్ ఈజె స్కాలర్. ఉయ్ కెనాట్ కంపీట్ విత్ హిం" అన్నాడు మొహం గంటు పెట్టుకుంటూ.

"అదికాదు నా ఉద్దేశం........" అని వెంకట్రామయ్య ఏదో చెప్పబోతే, "చాల్లే నాన్నా! ద డిస్కషన్ ఈజ్ గోయింగ్ టు అబ్సర్డ్ లెంగ్త్స్. లెటజ్ పుట్ ఏన్ ఎండ్ టు ఇట్..." అన్నాడు సుబ్రహ్మణ్యం.

వెంకట్రామయ్యకూ కొడుకు అలా మాట్లాడినందుకు కోపం వచ్చినా నవ్వేశాడు, మరేం మాట్లాడలేదు.

కార్లో ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు సుబ్రహ్మణ్యం చివాట్లు పెట్టాడు తండ్రికి. "ఎందుకు నాన్నా! మన గొప్ప చూపించుకోటానికి ఇతర్లని అవమానించాలా?"

"నా అభిప్రాయం ఎవర్నీ అవమానించాలని కాదు, నేను ఎవర్నీ అవమానించ లేదు. నేనేదో గొప్ప వాడిననీ భావించను. అవమానితులమవుతున్నా మన్న భావం అలా ఫీలయ్యేవారి మనసుల్లోనుండి పుట్టేదే. అనంతరాములు నేను అవమానించానని అనుకోలేదే."

"ఆయన అనుకోకపోతేనేం, ఆయన కొడుకనుకున్నాడు. ఏదో మేమిట్లా బతుకుతున్నాం. మా బతుకు మమ్మల్ని బతకనీ" అన్నాడు దురుసుగానే. వెంకట్రామయ్య

కూడా గట్టిగానే మాట్లాడగలడు. తల్లి లేని పిల్లవాడు. వాదించటం మానేసి కళ్ళనీళ్లు పెట్టుకుంటాడు. అది భరించ లేడు వెంకట్రామయ్య. అందుకే కొడుకు నేమీ అనలేడు. ఇప్పుడూ మాట్లాడలేదు.

కొడుకు తీసుకెళితే వెంకట్రామయ్య షేక్స్‌పియర్ పుట్టిన ఊరు స్ట్రాట్‌ఫర్డ్ అపాన్‌అవాన్ చూసి వచ్చాడు. ఆంగ్ల సాహిత్యాన్ని చదువుకున్న మనిషి కనుక వెంకట్రామయ్యకు తనేదో కొత్తదేశం వచ్చినట్టుఫీలవలేదు. ఊళ్ళపేర్లూ, లండనులోని వీధుల పేర్లూ తెలిసినవే. చదువుకున్నది ఇప్పుడు పునర్నవీకరణం చేసుకోవటమే.

ఆనాడు వినాయకచవితి. మిత్రులందరూ సుబ్రహ్మణ్యం ఇంట్లోనే పండగ జరుపుకున్నారు. భోజనాలు కూడా అక్కడే.

అప్పుడు "హౌ డు యు ఫైండ్ ద బర్త్ ప్లేస్ ఆఫ్ షేక్స్‌పియర్, అంకుల్?"అని అడిగాడు ప్రహ్లాద్. అతడు కన్నడిగుడు.

కొడుకు వంక చూశాడు వెంకట్రామయ్య. కొడుకు నవ్వటంతో మొదలెట్టాడు.

"ఎ బ్యూటిఫుల్ ప్లేస్. మేం వెళ్ళేప్పటికి కొద్దిగా డ్రిజిల్ కూడా మొదలయింది. నేను చదువుకున్నట్టుగానే ఉంది. వార్‌విక్‌షైర్ ప్రకృతి శోభలో, వంకరలు తిరుగుతూ ప్రవహించే అవాన్ నది ఒడ్డున ఉంది స్ట్రాట్‌ఫర్డ్. ఇది ఎండాకాలమా? ఏనదీ ఎండిపోయినట్లు కనిపించదు. థేమ్స్ నది కూడా నీళ్ళతో నిండుగా ఉంది. షేక్స్‌పియర్ అమరుడు! రాజులు, ప్రముఖులు కాలగతిలో ఎందరు కలిసి పోలేదు. భావి తరాలకు వాళ్లెవరు గుర్తు? సౌతాంప్టన్ ఎర్ల్ ఆయనకు స్నేహితుడు, పోషకుడు. అతనికే కవి తన 'వీనస్ అండ్ అడోనిస్' కావ్యాన్ని అంకితమిచ్చాడు. ఇతనికి గురువు ఎసెక్స్ ఎర్ల్. ఎలిజబెత్ రాణి అనుగ్రహ మున్నంత వరకూ అంతా బాగానే నడిచింది. ఐర్లాండును పట్టుకోటంలో అసఫలమయ్యాడు గురువు. రాణీగారి ఆగ్రహానికి గురికావటంతో తిరుగుబాటు చేశాడు. పట్టుకున్నారు, ఉరితీశారు. శిష్యుడినీ టవర్‌లో బంధించారు. రాణి చనిపోయి జేమ్స్‌రాజవటంతో బతికిపోయాడు. షేక్స్‌పియర్ డ్రామా ట్రూపును హెచ్చరించి వదలి వేశారు. ఇప్పుడు జనం వాళ్ళల్లో ఎవరిని తల్చుకుంటారు. ఎలిజబెత్‌రాణిని కూడా ఎవరూ తల్చుకోరు. షేక్స్‌పియర్ పెద్దగా చదువుకోలేదు. జన్మతః కవి. జీవనోపాధికోసం లండను వచ్చాడు. నాటకాలు రాశాడు. డబ్బు సంపాదించాడు. పుట్టిన ఊళ్ళో ఆస్తులు కొన్నాడు. హాయిగా బతికాడు. యాభైరెండేళ్ళకే పోయాడు. ఎక్కడా వివాదాల్లో ఇరుక్కోలేదు, ఎవర్నీ విమర్శించలేదు. 'ఓ యుగపు పరిశ్రమ చేసిన నా షేక్స్‌పియర్‌కు రాళ్ళకుప్పలతో నిర్మించే సమాధులెందుకు?' అని ప్రశ్నించాడు మిల్టన్....."

అప్పుడు నోరెత్తాడు ప్రభాకర్. క్రితం సారి వెంకట్రామయ్య లండను టివి ఛానల్‌ను తన్ను అవమానించే ఉద్దేశంతోనే తిట్టాడని అతడు భావించాడు. అతన్ది నిజాంబాదు దగ్గర డిచ్‌పల్లి. అతను ఉస్మానియా యూనివర్సిటీలో బి.ఇ చదివాడు. అతని తండ్రి యాదగిరి నిజాంబాదు ప్రభుత్వాసుపత్రిలో డాక్టరుగా పని చేస్తున్నాడు.

"అది సరే, సుబ్బూస్ ఫాదర్! మనకు ఇంగ్లీషు అవసరమా? అప్పుడు వలసపాలనలో ఉన్నాం. వాళ్ళు ఇంగ్లీషు మన నెత్తిన రుద్దారు. మనకు స్వాతంత్ర్యం వచ్చాక కూడా వాళ్ళభాష మనకెందుకు, సాహిత్యం ఎందుకు? మనమింకా బానిసత్వాన్ని వదిలించుకో లేకుండా ఉన్నాం. ఇంక ఇండియన్స్ అంతా ఆంగ్లమానస పుత్రులై పడి ఉంటారన్నాట్ట ఆ మెకాలే ఎవరో..."

"మంచి పాయింటయ్యా, డాక్టర్ యాదగిరీస్ సన్! మనం ఎవరికీ బానిసలం కాదు. షేక్స్‌పియరూ, మిల్టనూ చదువుకోవాల్సిన పనిలేదు. మన ఎం.ఏ ఇంగ్లీషు కోర్సులోనూ మార్పు తేవాలి. అందులో మిగతా సాహిత్యాలకూ ప్రాధాన్యమివ్వాలి. మాకు అది అవసర పడింది. మేం చదువుకున్నాం. మీకవసరంలేదు. కనుక వద్దు. కానీ, ఇంగ్లీషు భాషను అలా వదిలెయ్యలేం. మీకు షేక్స్‌పియరూ, మిల్టనూ తెలియక పోయినా ఫర్లేదు. ఇంగ్లీషు రాకపోతే ఇంతదూరం వచ్చేవాళ్ళుకాదు మీరు..."

ఇంగ్లీషు వాడకాన్ని గురించిన చర్చ వదిలేసి, అందరూ వెంకట్రామయ్య ప్రభాకర్‌ని 'డాక్టర్ యాదగిరీస్ సన్' అని సంబోధించటాన్ని తప్పు పట్టారు."బికాజ్ హి అడ్రస్డ్ యు 'సుబ్బూస్ ఫాదర్', ఇటీజ్ ఇన్ బాడ్ టేస్ట్ టు కాల్ హిం 'డాక్టర్ యాదగిరీస్ సన్'. దట్స్ ద ఐడెంటిటీ యు హేవ్ హియర్" అన్నాడు ప్రహ్లాద్.

"నిజమే" అన్నాడు రామ్మోహన్.

అందరూ తన మీదపడి తన తప్పు ఒప్పుకోమన్నట్లు పట్టుబట్టినట్టు కన్పించింది.

ప్రహ్లాదు రీజనబుల్ మనిషి. అతను అలా అన్నాక ఇంక 'సుబ్బూస్ ఫాదర్' కు అలవాటు పడాలని నిర్ణయించుకున్నాడు వెంకట్రామయ్య. "ఓకే! ఐ డు అగ్రీ..ఐ విత్‌డ్రా మై వర్డ్స్ అన్‌కండిషనల్లీ" అని ఓ క్షణమాగి" మెకాలే సిద్ధాంతం తప్పని ప్రూవ్ చేస్తున్నారు మీరు. వచ్చిన చిక్కేమిటంటే, మన నన్నయ, తిక్కనల మీద కూడా ప్రేమ లేకుండా పోతున్నది మన యువతరానికి...."

"నన్నయ, తిక్కనలు కూడు పెడతారా, నాన్నా, వదిలెయ్!" అన్నాడు సుబ్రహ్మణ్యం, అసహనంగా.

"నో..నో, డోంట్ సే దట్! అఫ్‌కోర్స్, ఐ నో ఎ లిటిల్ ఆఫ్ కన్నడ లిటరేచర్, బట్ ఐ మస్ట్ ఆక్సెప్ట్ దట్ ఇటీజె లాప్స్ ఆన్ మై పార్ట్. దట్స్ అవర్ కల్చర్. మన పిల్లలు ఇక్కడ చదువుతున్నారు. వాళ్ళు ఏ మేరకో ఆంగ్ల సాహిత్యం చదవక తప్పదు. వీళ్ళు చదివిస్తారు. మన లాగా వదలరు. మనం మన సాహిత్యం చదువుకోవాల్సిన అవసరం లేదని చెప్పిన మన విద్యావిధానం మన్ని మోసం చేసింది" అన్నాడు ప్రహ్లాద్.

ఆ తర్వాత వెంకట్రామయ్య మాట్లాడలేదు.

అలా సుబ్రహ్మణ్యం ఫ్రెండ్స్ సర్కిల్లో 'సుబ్బూస్ ఫాదర్ ఈజె డిఫరెంట్ కైండాఫ్ మాన్' అన్న అభిప్రాయం ఏర్పడి పోయింది. 'సుబ్బూస్ ఫాదర్' అంటే వెంకట్రామయ్య అఫెండ్ అవుతాడనీ ఎలాగో గ్రహించారు వాళ్ళు. 'అంకుల్' పదం వదిలేసి 'సుబ్బూస్ ఫాదర్' అనటం మొదలు పెట్టారు. క్రమక్రమంగా వెంకట్రామయ్యకూడా 'సుబ్బూస్ ఫాదర్ ' పిలుపుకు అలవాటు పడి పోయాడు. ఇప్పుడు "అంకుల్' అని పిలిస్తే ఉలిక్కి పడేట్టున్నాడు.

నిజానికి సుబ్రహ్మణ్యం తండ్రికేం లోపం చెయ్యలేదు. కొడుకేమన్నా పెద్దగా పట్టించుకోరు తల్లిదండ్రులు. కోడలేమన్నా, అదేం పెద్దగా పట్టించుకోవాల్సింది కాకపోయినా, పెద్ద రాద్ధాంతం చేస్తారు. వెంకట్రామయ్యను కోడలు మర్యాదగానే చూసింది. ఆ మాట అతనే ఒప్పుకుంటాడు. అతని మనుమలు బాగా ప్రేమగా చూశారు. అరమరికలులేని ప్రేమ పిల్లలది.

చిన్న మనవడి స్కూలు ఇంటికి దగ్గరే. మిగతా వాళ్ళంతా బిజీగా ఉంటారు కాబట్టి, వెంకట్రామయ్యే వెళ్ళి పిల్లవాడిని స్కూలు దగ్గర దిగబెట్టేవాడు. పెద్దవాళ్ళెవరైనా పిల్లల్ని దిగబెట్టాలని రూలు. రూల్సు కచ్చితంగా పాటిస్తారు బ్రిటీషువాళ్ళు. యూనివర్సిటీ చదువు వరకు పిల్లలకు ఉచిత విద్య. అందరికీ ఉచిత వైద్యం. పిల్లలకయితే మందులు కూడా ఉచితమే. ఓ రోజు పిల్లవాడిని స్కూల్లో దించి వస్తూంటే ప్రహ్లాదు కనిపించాడు. అతడూ తన కొడుకును దించటానికి వచ్చాడు.

"హలో, హౌ డు యు డు?" అని పలకరించాడు వెంకట్రామయ్య.

అతడు గుర్తుపట్టినట్లు లేదు. ప్రశ్నార్థకంగా తన వంక చూస్తే, "నేనయ్యా, గుర్తు పట్టలేదూ? ఐ యామ్ సుబ్బూస్ ఫాదర్" అన్నాడు.

"సారీ! వెంటనే గుర్తు పట్టలేక పోయాను. రెండు వారాలయి పోయింది మనం కలిసి" అన్నాడతను.

ఇంగ్లాండులో వెంకట్రామయ్యకు తోచేది కాదు. కొడుకు, కోడలు, పిల్లలూ ఉండమన్నా ముందు ఫ్లయిటు రిజర్వు చేసుకున్న సమయానికి బయలు దేరాడు.

తిరిగి వచ్చేటప్పుడు ఫ్లయిటులో హనుమంతు కలిశాడు. ఇప్పుడతను 'సుబ్బూస్ ఫాదర్' అని జోక్ చేసినా వెంకట్రామయ్య పట్టించుకోలేదు. 'ఏమయిందా ఈయనకి?' అనుకున్నాడు కానీ, తన పక్కన మరో సన్నిహిత మిత్రుడుండటం వల్లా, తమ సీట్లు దూరంగా ఉండటం వల్లా వెంకట్రామయ్యతో ఎక్కువ సేపు మాట్లాడలేక పోయాడు అతను.

శంషాబాదులో ఇమ్మిగ్రేషను ఆఫీసరు పేరడిగితే, తడుముకోకుండా, "సుబ్బూస్ ఫాదర్" అని చెప్పాడు.

"ఇదేమిటయ్యా, పాస్‌పోర్టులో నీ పేరు వెంకట్రామయ్యని ఉంటే?" అన్నాడతను.

"ఆ ఆ, అదే అయుంటుంది" అని జవాబిచ్చాడు వెంకట్రామయ్య.

'ముసలాడు నిద్ర మత్తులో ఉన్నాడ'నుకొంటూ, నవ్వి పంపించేశాడు వెంకట్రామయ్యని.

వెంకట్రామయ్య ఇండియాకు తిరిగి వచ్చాక, బ్రిటను సంగతులు చెప్తే, నేనడిగాను, "తప్పేముందిరా! 'సుబ్బూస్ ఫాదర్' అన్నా, 'అంకుల్' అన్నా అర్థం ఒకటే కదా! నువ్వు అఫెండు అయే అంశమేముంది అందులో?" అని అడిగాను.

"ఉంది. 'మీ నాన్న ఉన్నాడా?' అని అడిగినా, 'మీ అమ్మ మొగుడు ఉన్నాడా?' అని అడిగినా అర్థం ఒకటే. మొదటిది మృదువుగా ఉంటే, రెండోది చెవికి కఠోరంగా వినపడుతుంది. 'అంకుల్' అంటే నాకు ప్రాధాన్యం. 'సుబ్బూస్ ఫాదర్' అంటే సుబ్బుకే ప్రాధాన్యం కానీ నాకు కాదు. 'ఫాదర్' అన్న నామవాచకానికి 'సుబ్బూస్' అన్న విశేషణపు ఊతం లేకపోతే దానికి అర్థంలేదు. నేనేం కుంటివాణ్ణా కర్ర సాయం తీసుకోటానికి! అదీ తేడా! 'సుబ్బూస్ ఫాదర్'కి ఐడెంటిటీ లేదు, 'అంకుల్'కి ఉంది...."

"ఒక్కొక్కసారి నాకు అనిపిస్తుంటుంది, నీ బుర్ర రిపేరుకు పంపించాలని...."

"నీకే కాదు నాకూ అలాగే అనిపిస్తూ ఉంటుంది. ఒక విషయం. ఏ మనిషయినా తనకోసం కూడా బతకాలి. భార్యా, బిడ్డలకోసమే బతకటం కుదరదు. అలా మమేకమై బతకాలన్నా, వాళ్ళు పడనివ్వరు. నేను సుబ్రహ్మణ్యం తండ్రిగా బతకాలనుకుంటే, నా స్వంత బతుకు నా కుండదు. నా కొడుకు ఆలోచనలు, ఇష్టాయిష్టాల ప్రకారం నేను బతకవల్సి ఉంటుంది. నేనెవరినయినా ఇంటికి ఆహ్వానించాలంటే, నా కొడుకుకు, కోడలుకు ఇష్టమయితేనే ఆహ్వానించాలి. లేకపోతే మానుకోవాలి. అదంత అవసరమా? అలా బతకటం వల్ల నేను నా కొడుకు మీద ఆధార పడటం ఎక్కువవుతుంది. ఏ కొడుకయినా తండ్రినిగానీ,

మరెవరిని గానీ కొంతమేరకే భరించగలడు. ఎందుకంటే వాడి బతుకులో వాడి ప్రాబ్లమ్స్ వాడి కున్నాయి. అవి తండ్రి తీర్చేవి కావు.ఎవడి బతుకు వాడు బతకవల్సిందే......"

'నీదంతా పిచ్చిరా! ముసలితనమొచ్చాక, ఇంక మనకు సొంత బతుకేమిటి? పిల్లల బతుకే బతకాలి" అన్నాను.

"మరి నీ పెద్దకొడుకు నీతో ఉండటం లేదేం? అత్తకూ, కోడలికీ పడటం లేదు. అందుకే వాళ్ళను విడిగా ఉండమన్నానంటావు! కొంతమంది పిల్లలు తల్లిదండ్రులను తీసుకొచ్చి తమ దగ్గరుంచుకుంటారు. అంతే, ఇంక వాళ్ళ బాగోగుల సంగతి పట్టించుకోరు. 'నా దగ్గరే ఉంచుకుంటున్నాను కదా, ఇంకేం కావాలి' అనే తత్వం..."

అట్లా వదిలేస్తే వాడు చెప్పుకుంటూనే పోతాడు. అందుకే అడ్డొస్తూ, "అసలు నీలోనే లోపం ఉందిరా! నీతో ఉండటం కూడా నీ పిల్లలకు కష్టమే. నీది సర్దుకుపోయే మనస్తత్వం కాదు. అన్నింటికీ తప్పులు పడుతుంటావు! నువ్వదో రకం మనిషివి" అన్నాను.

"నువ్వు చెప్పింది నిజమే అయి ఉండవచ్చు. బట్ ఐ యామ్ వాట్ ఐ యామ్. ఐ కాంట్ బి యు, ఆర్ సమ్‌బడీ ఎల్స్."

జాగృతి *(వార పత్రిక)*